నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
3 | శనివారం 10 ఆగస్టు 2024 | MAHABUBABAD

శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా, అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

ములుగులో పనిచేస్తున్న డాక్టర్, ప్యారావెట్, హెల్పర్, కెప్టెన్

గొడ్డుచాకిరీ చేసినా..

పశు వైద్యం కోసం కాల్ రాగానే సంచార వైద్య బృందం ఆగమేఘాలపై వెళ్లి వైద్యం అందిస్తున్నది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖకు సరైన నిధులు కేటాయించకపోవడంతో నెలనెలా వేతనాలు అందడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది అంబులెన్స్‌ల్లో పనిచేస్తున్న 36 మంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మందుల సరఫరా సక్రమంగా లేక ఉన్న వాటితోనే సరిపెడుతున్నారు. ఇటు జీతాలు రాక, మందుల సరఫరా జరగక సేవలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. 13 నెలలుగా వేతనాల్లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి తమకు వేతనాలు అందించడంతో పాటు మందుల కొరత తీర్చాలని వారు కోరుతున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

వేతన వెతలు ఎన్నాళ్లు?

1962 సిబ్బంది 'గొడ్డు' చాకిరీ

- పది నెలలు గడుస్తున్నా జీతాలివ్వని రాష్ట్ర ప్రభుత్వం
- సంచార పశువైద్య సిబ్బంది ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో విధుల్లో 36 మంది
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆదుకోవాలని వేడుకోలు

ములుగు, ఆగస్టు 9(నమస్తే తెలంగాణ) : పశు సంపద పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న సంచార పశువైద్య(1962) ఉద్యోగులు వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. నిరంతరం మూగజీవాల సేవకు అంకితమవుతున్న సిబ్బంది 10 నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2017లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంచార పశు వైద్యం కోసం 1962 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి, జనగామ, పరకాల, పాలకుర్తి, నర్సంపేట, వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్ ప్రాంతాలకు తొమ్మిది అంబులెన్స్‌లను కేటాయించింది. ఇందులో పనిచేసేందుకు ఒక పశు వైద్య నిపుణుడు, ఒక ప్యారావెట్, హెల్పర్, కెప్టెన్‌ను నియమించింది. ఒక్కో అంబులెన్స్‌లో వీరంతా 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ రాగానే గ్రామాల్లో పర్యటిస్తూ పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. పశువైద్యులకు రూ.35వేలు, ప్యారావెట్‌కు రూ.14వేలు, కెప్టెన్‌కు రూ.8,500, హెల్పర్‌కు రూ.7,500 చొప్పున ప్రతినెలా జీవీకే సంస్థ ద్వారా వేతనాలందిస్తున్నారు. దీంతో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో పశు మరణాలు తగ్గుముఖం పట్టడంతో పాటు రైతులు, పశు యజమానులకు మేలు చేకూరినట్లయ్యింది.

గొర్రెకు చికిత్సను అందిస్తున్న 1962 సిబ్బంది (ఫైల్)

పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలంటూ ధర్నా చేస్తున్న రైతులు

పాల బిల్లులు ఎప్పుడిస్తరు?

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో విజయ డెయిరీ రైతుల ధర్నా
- పెండింగ్‌లోనే ఐదు బిల్లులు
- 15 రోజులకోసారి చెల్లించాలని డిమాండ్

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 9 : పెండింగ్ పాల బిల్లులు చెల్లించాలని విజయ డెయిరీ రైతులు ధర్నా చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ బీఎంసీ(బిల్క్ మిల్క్ కూలింగ్) యూనిట్ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్, జఫర్‌గఢ్ మండలాల రైతులు శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ జాతీయ రహదారిపై పాల డబ్బాలతో రాస్తారోకో చేయగా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు చేరుకొని వారిని సముదాయించి ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ స్టేషన్ ఘన్‌పూర్ బీఎంసీ యూనిట్‌కు పదిహేను రోజుల పాల బిల్లు సుమారు రూ.50 లక్షలు అవుతుందని, గతేడాది నవంబర్ నుంచి రెండు, మూడు నెలలకు ఒకసారి, అది కూడా 15రోజుల బిల్లులు మాత్రమే చెల్లిస్తున్నారని చెప్పారు. డెయిరీ బిల్లులు ఇవ్వకపోవడంతో బ్యాంకు కిస్తీలు కట్టలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఐదు బిల్లులు రావాల్సి ఉందని, ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష వరకు పెండింగ్ ఉందన్నారు. విజయ డెయిరీకి ముఖ్యమంత్రే చైర్మన్‌గా ఉన్నా పాడి పరిశ్రమకు ఇటీవలి బడ్జెట్‌లో నిధులేమీ కేటాయించలేదన్నారు. మరొకరిని చైర్మన్‌గా నియమించకుండా రేవంత్ సర్కారు రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి, ప్రతి 15రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిరసన తెలిపిన వారిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు సాదం రమేశ్, గొర్రెల కుమారస్వామి, ఈర్ల రాజయ్య, గుర్రపు కుమారస్వామి, మునిగల వెంకన్న, పదిర లక్ష్మారెడ్డి, పదిర వాసుదేవ రెడ్డి, వడ్లూరి వెంకటాద్రి, కోల కుమార్ పాల్గొన్నారు.

అయ్యో పాపం

- పసిగుడ్డును పీక్కుతున్న కుక్కలు
- ఎంజీఎం దవాఖానలో దారుణ సంఘటన
- మూడు రోజుల శిశువు మృతదేహాన్ని కొరుక్కుతిన్న శునకాలు
- ఆడ, మగ గుర్తించలేని స్థితిలో దేహం
- కొరవడిన నిఘా, పర్యవేక్షణ

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 9 : ఎంజీఎంలో దారుణం జరిగింది. మృతశిశువును వీధికుక్కలు పీక్కుతిన్న ఘటన అందరినీ కలచివేసింది. నిత్యం వేలాది మందితో రద్దీగా ఉండే అత్యవసర విభాగం వద్ద శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు వదిలివెళ్లగా కుక్కలు నోట కరుచుకొని చీల్చడంతో ఆ శిశువు ఆడ, మగ అనే ఆనవాళ్లు కూడా తెలియని స్థితిలో ఉంది. సమాచారం అందుకున్న వైద్యాధికారులు మృతదేహాన్ని పరిశీలించి శిశువు వయస్సు మూడు లేదా నాలుగు రోజులుంటుందని చెప్పగా, ఘటనపై కలెక్టర్ సత్యశారద విచారణకు ఆదేశించగా తహసీల్దార్ ఇక్బాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా ఎంజీఎంలో ఇంత జరుగుతున్నా సరైన నిఘా వ్యవస్థ, పర్యవేక్షణ లేకపోవడమే కారణమని తెలుస్తోంది.

ఎంజీఎం అత్యవసర విభాగాన్ని ఆనుకొని ఉన్న పోలీస్ ఔట్‌పోస్టు పక్కనే గుర్తుతెలియని వ్యక్తులు శిశువు మృతదేహాన్ని వదిలివెళ్లారు. మృతదేహాన్ని గుర్తించిన కుక్కలు నోట కరుచుకొని ఉండడాన్ని స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న ఔట్ పోస్టు సిబ్బంది గమనించి వైద్యాధికారులు, స్థానిక మట్టెవాడ పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే స్పందించిన ఎంజీఎం వైద్యాధికారులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి శిశువు వయస్సు కేవలం మూడు నుంచి నాలుగు రోజులు మాత్రమే ఉంటుందని, శిశువు జననం హాస్పిటల్‌లో జరిగినట్లుగానే ఉందని, ప్రసవ సమయంలో వైద్యం తెలిసిన వ్యక్తులు సేవలందించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, చేతికి సెలైన్ క్యాన్‌లా, బొడ్డుకు క్లిప్ కూడా అలానే ఉందని తెలిపారు. అయితే అత్యవసర వైద్యసేవల కోసం వచ్చి శిశువు మృతిచెందిన విషయాన్ని గుర్తించి ఇక్కడే వదిలి వెళ్లి ఉంటారని వైద్యాధికారులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిశువు మృతదేహాన్ని వస్త్రంలో చుట్టి మార్చురీలో భద్రపరిచారు. కుక్కలు శరీర భాగాలను నోటితో చీల్చడం వల్ల శిశువు ఆడ, మగ అనేది గుర్తించలేని స్థితిలో మృతదేహం ఉందనారు.

శిశువు మృతదేహం

కొరవడిన నిఘా

ఎంజీఎం నిఘా, పర్యవేక్షణ వైఫల్యం మరోమారు బయటపడింది. పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు అందుకు తగిన చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఉద్యోగులు, సిబ్బంది అంటున్నారు. శుక్రవారం ఔట్‌పోస్టు సిబ్బంది డ్రిల్‌లో భాగంగా సాయంత్రం సుమారు 4గంటల సమయంలో పరిసరాలను శుభ్రం చేసిన సమయంలో అక్కడ ఎలాంటి వస్తువులు గానీ, శిశువు ఆనవాళ్లు గానీ గుర్తించలేదు. ఎంజీఎంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థ పనిచేయకపోవడంతో నేడు ఈ శిశువు ఎవరు తీసుకొచ్చారనే విషయాన్ని గుర్తించలేకుండా పోయిందని పోలీసులు చెబుతున్నారు. ఘటనపై వరంగల్ కలెక్టర్ సత్యశారద స్పందించి తహసీల్దార్ ఇక్బాల్‌ను విచారణకు ఆదేశించారు. ఈమేరకు ఆయన ఎంజీఎంకు వెళ్లి వివరాలు సేకరించారు.

చేతబడి పేరిట వసూళ్లు

ఆరుగురి అరెస్టు

నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్సై సతీశ్

నర్సింహులపేట, ఆగస్టు 9: చేతబడి పేరుతో పూజలు చేస్తామని ప్రజలను మోసం చేసిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్సై గంధ్రాతి సతీశ్ వివరాలు వెల్లడించారు. మండలంలోని కౌసల్యదేవిపల్లి, జయపురం, బక్కతండా గ్రామాల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన మోతే రాములు, పర్వతం లక్ష్మయ్య, సైదులు,అశోక్, సిరిగిరి నరేశ్, తుర్పాటి గంగారాజు చేతబడి చేస్తామని, శాంతి చేయాలని, నరదిష్టి తగిలిందని ప్రజలకు మాయమాటలు చెప్పేవారు. వీరు పర్వతం లక్ష్మయ్యను గుర్రం బాబా వేషధారణలో తీసుకొచ్చి ప్రజలను దేశగురువుగా నమ్మించి పూజలు చేయకుంటే అశుభం కలుగుతుందని మోసం చేసి డబ్బులు వసూలు చేశారు. ఈ క్రమంలో బక్కతండాకు చెందిన గుగులోత్ నరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి పడమటిగూడెం గ్రామంలో ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి రూ. 9 వేలు, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకుని, గుర్రాన్ని సేఫ్ కస్టడీకి పంపినట్లు తెలిపారు.

వీధి దీపాల కోసం టార్చిలైట్లతో నిరసన

టార్చిలైట్ల వెలిగించి నిరసన తెలుపుతున్న గిరిజనులు

- నెల రోజులుగా వెలగని లైట్లు
- రాత్రివేళ చక్రుతండా వాసుల ర్యాలీ

గూడూరు, ఆగస్టు 9: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చక్రు తండాలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదని తండావాసులు గురువారం రాత్రి టార్చిలైట్లతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. నెల రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదని గ్రామ ప్రత్యేక అధికారికి విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోయారు. దీంతో వానకాలంలో విషపురుగులు, కుక్కలు కరుస్తాయేమోనని భయాందోళన చెందుతున్నట్లు తెలిపా రు. శ్రావణమాసంలో తీజ్ పండుగ జరుపుకోలేకపోతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని రాంచందర్‌నాయక్, కిషన్, భద్రు, శ్రీనివాస్, రాంలీ, నర్సీ, ధర్మా, సుక్కి, అమీన్‌నాయక్, కట్టి, యాకూబ్ కోరారు.

ఇదేం తెగుళ్ల మందు?

- నివారణకు పిచికారీ చేసిన రైతులు
- ఎండిపోయిన మిరప నారు
- ఎకరానికి రూ.20వేల నష్టం
- దుకాణదారుడిపై ఫిర్యాదు

ఎండిపోయిన మిరప నారు

కేసముద్రం, ఆగస్టు 9 : మిరప నారును తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు నివారణ పిచికారీ చేస్తే అసలుకే మోసమైంది. మందు పనిచేయకపోగా వేసిన నారంతా ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముంద్రం మండలం ధన్నసరి, రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన గోపాల నర్సింహారెడ్డి, వేం నరేశ్‌రెడ్డి, రమేశ్, గుగులోత్ యాకు, మరికొందరు మిరప సాగు చేసేందుకు నెల రోజుల క్రితం మిరప విత్తనాలు కొనుగోలు చేశారు. ఎకరానికి సుమారు రూ.15 వేల విలువైన మిరప నారు పోశారు. అయితే వరుస వర్షాల వలన మిరప నారుకు బుడిద తెగులు, వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగులు సోకింది. 15 రోజుల నుంచి రోజూ కొంత మంది రైతులు ఓ ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లి మిరప నారుకు వచ్చిన తెగుళ్ల గురించి దుకాణదారుడికి తెలియజేయగా అతడు ఓ కంపెనీకి చెందిన మందు ఇచ్చి పిచికారీ చేస్తే తెగుళ్లు పోతాయని చెప్పాడు. సరేనని నమ్మి రైతులు మందు తీసుకెళ్లి పిచికారీ చేయగా వారం తర్వాత నారు మడిలోని మిరప మొక్కలు చనిపోయి ఎకరానికి రూ.20 వేల నష్టం వాటిల్లింది. అంతేగాక మిరప సాగు చేయాలనుకుంటే మళ్లీ నారు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ విషయమై రైతులు వ్యవసాయ అధికారి వెంకన్నకు ఫిర్యాదు చేయగా శుక్రవారం ఆయన ఎండిన మిరప నారును పరిశీలించారు. అలాగే ఫర్టిలైజర్ దుకాణంలో రైతులకు ఇచ్చిన మందుల శాంపిల్స్ సేకరించి నాణ్యతా పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా దుకాణదారుడిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఏవో చెప్పారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తాం

టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు

పోచమ్మమైదాన్, ఆగస్టు 9: ఆప్కో ద్వారా కొనుగోలు చేసిన కార్పెట్ల విషయాన్ని చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ దృష్టికి తీసుకెళ్తామని టెస్కో జనరల్ మేనేజర్ అశోక్‌రావు అన్నారు. హనుమకొండలోని చేనేత, జౌళిశాఖ కార్యాలయానికి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా కొత్తవాడలోని పలు నేత సంఘాల ప్రతినిధులు జీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇటీవల ఏపీలోని ఆప్కో ద్వారా ఖరీదు చేసి, స్టాపింగ్ చేసిన కార్పెట్లను అక్కడి అధికారులు తీసుకోకపోవడంపై జీఎంకు వివరించారు. ఈ విషయాన్ని తాను శైలజా రామయ్యర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే, తెలంగాణలో టెస్కో ద్వారా కార్పెట్లు, బెడ్ షీట్లను మూడు నెలలకోసారి ఆర్డర్ ఇప్పించి, నెలకోసారి కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు.

ఏటూరునాగారం : ఐటీడీఏ ఆవరణలోని కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసిన కలెక్టర్ దివాకర్, పీవో చిత్రా మిశ్రా, అధికారులు, ఆదివాసీ సంఘాల నేతలు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

ఆదివాసీ దినోత్సవంలో ములుగు కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం/ ములుగు రూరల్, ఆగస్టు 9 : ఆదివాసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ గిరిజన చట్టాలను అమలు చేస్తామని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ తీసి కుమ్రంభీం విగ్రహానికి కలెక్టర్ దివాకర, పీవో చిత్రామిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆదివాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి తుడుందెబ్బ జెండాను ఆవిష్కరించారు. అలాగే ములుగులో ఆదివాసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సమావేశాల్లో కలెక్టర్ మాట్లాడారు. గిరిజనులు తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. తాను చదువుకునే రోజుల్లో ఆదివాసీల చట్టాలను పూర్తిగా తెలుసుకున్నానని పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా వంద శాతం పథకాలను అమలు చేస్తామన్నారు. పీవో చిత్రామిశ్రా మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చట్టాలను అమలు చేయాలని, ఆదివాసీల అభివృద్ధికి పాటు పడాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేయగా కలెక్టర్, పీవో విద్యార్థులతో కలిసి స్టెప్పులేసి ఉత్సాహపర్చారు. వేడుకల్లో డీడీ పోచం, ఏవో రాంబాబు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఆర్డీవో కే సత్యపాల్‌రెడ్డి, ఈఈ వీరభద్రం, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, పెసా కో ఆర్డినేటర్ ప్రభాకర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, జిల్లా అధ్యక్షులు, నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు గొప్ప వీరయ్య, మైపతి అరుణ్, మైపతి సంతోష్, పొడెం బాబు, పొడెం రత్నం, కొప్పుల రవి, పులిశె బాలకృష్ణ, చింత కృష్ణ, పొదెం కృష్ణప్రసాద్, కోట నర్సింహులు, పొడెం శోభన్, ఈసం రామ్మూర్తి, చేల బాబారావు, పెనక ప్రభాకర్, కబ్బాక శ్రావణ్, మహిళా సంఘాల ప్రతినిధులు సరిత, శమంతకమణి పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక భవనం పైనుంచి దూకి అఘాయిత్యం
- సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ఘటన
- దవాఖానకు తరలించడంలో ఉపాధ్యాయినుల అలసత్వం
- పర్యవేక్షణ లోపానికి సాక్ష్యం

ములుగు, ఆగస్టు 9(నమస్తేతెలంగాణ): హాస్టల్‌లో చదువు కోవడం ఇష్టం లేదని విద్యార్థిని భవనం పైనుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ కార్తీకశ్రీ తండ్రి రాజు కొన్నేళ్ల క్రితం మృతి చెందగా, తల్లి సుమలత 5వ తరగతిలో గురుకులంలో చేర్పించింది. ప్రస్తుతం ఇక్కడే 9వ తరగతి చదువుతోంది. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక శుక్రవారం ఉదయం విద్యార్థిని మెట్ల మార్గంలో భవనం పైకెక్కి వెనుక వైపు దూకింది. చుట్టుపక్కల ఇండ్ల వారు చూసి గురుకుల సిబ్బందికి తెలిపినప్పటికీ చాలా సేపటి తర్వాత వచ్చి లోపలికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. గాయాలతో ఉన్న విద్యార్థిని చూసిన చుట్టుపక్కల వారు దవాఖానకు తీసుకెళ్లాలని గొడవ చేయడం తో ఆటోలో ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించా రు. పరీక్షించిన వైద్యులు ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో తరలించగా ఎంజీఎంలో సైతం బెడ్స్ ఖాళీ లేకపోవడంతో గంటపాటు అంబులెన్స్ స్ట్రెచర్‌పై ఉండి విద్యార్థిని అవస్థ పడినట్లు అంబులెన్స్ డ్రైవర్ తెలిపారు. అనంతరం వైద్యులు పరీక్షించి చికిత్స ప్రారంభించారు. కాగా, ఈ విషయమై గురుకుల ప్రిన్సిపాల్ శారదను వివరణ కోరగా భవనంపైన టాయిలెట్స్ ఉన్నాయ ని, కార్తీకశ్రీ సైతం అటు వెళ్లినట్లు భావించామని తెలిపా రు. ఎంజీఎంలో ఎంఆర్ఐ స్కాన్ మిషన్ పనిచేయకపోవడంతో హనుమకొండలోని గార్డియన్ హాస్పిటల్‌కు తీసుకువచ్చామని, ప్రస్తుతం విద్యార్థినికి వైద్యులు చికిత్స అంది స్తున్నట్లు తెలిపారు. కాగా, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల పై పర్యవేక్షణ లోపించడంతో ఇటీవల బండారుపల్లి టీజీఆ ర్ గురుకులంలో, ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠ శాలలో ఈ ఘటన జరిగినట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

'అనుమతిలేని కాలేజీల్లో చేరొద్దు'

కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9 :అనుమతిలేని కాలేజీల్లో విద్యార్థులు చేరొద్దని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి సూచించారు. డిగ్రీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సదరు కాలేజీ విశ్వవిద్యాలయ అనుబంధాన్ని కూడా పరిశీలించాలన్నారు. విశ్వవిద్యాలయ డీన్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలో కూడా సమాచారం తీసుకోవచ్చాన్నారు. కొన్ని కాలేజీలు పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మార్చుకొని విశ్వవిద్యాలయ అనుబంధాన్ని చూపుతూ డిగ్రీ ప్రవేశాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి అనుమతితో పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మారిన కాలేజీకి మాత్రమే కేయూ గుర్తింపు ఇస్తుందన్నారు.

సివిల్స్ ఉచిత కోచింగ్‌కు రేపు ప్రవేశ పరీక్ష

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 9 : రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్ట్స్ కాలేజీలో ఈనెల 11న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కొంగర జగన్మోహన్ తెలిపారు. హాల్‌టికెట్లను http://tsstudycircle.co.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష అనంతరం మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

జల్సాల కోసం దొంగతనాలు

అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- నలుగురు నిందితులు భూపాలపల్లి వాసులు
- రూ. 1.50 లక్షల విలువైన పుస్తెలతాడు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

మట్టెవాడ, ఆగస్టు 9: జల్సాలకు అలవాటుపడి చైన్‌స్నాచింగ్‌లతోపాటు పలు రకాల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్‌జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన బోళ్ల అనిల్(25), ఎండీ బాసిత్(19), ఎండీ షారుఖ్(24), ఎండీ షోయబ్‌ఖాన్(19) ముఠాగా ఏర్పడ్డారు. వీరు హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇటీవల వరంగల్ కొత్తవాడ ఏరియాలో ఓ మహిళ రాత్రి సమయంలో తన కూతురుతో కలిసి మడేలయ్య గుడి ప్రాంతం నుంచి ఎంజీఎం దవాఖాన వైపు వెళ్తున్నది. చీకటి ప్రదేశాన్ని ఎంచుకుని ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలతాడును లాక్కొని పారిపోయారు. బాధితురాలు వడ్లకొండ వనిత(37) మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సై విఠల్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టగా, శుక్రవారం ములుగురోడ్డు వద్ద నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 1.50 లక్షల విలువైన బంగారు పుస్తెలతాడును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. వీరిపై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదైనట్లు చెప్పారు. అలాగే, వైజాగ్‌లో గంజాయి విక్రయం, పరకాలలో చైన్‌స్నాచింగ్, ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో బైక్ దొంగతనాల కేసులో వీరు నిందితులుగా ఉన్నారన్నారని ఆమె వెల్లడించారు. నేరస్తులను పట్టుకున్న పోల